## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు బుధవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని రాజుల బజారు, సాయిబాబా ఆలయం వీధి, ఏలూరు రోడ్డు, బీఎస్ఎన్ఎల్ టవర్ ఏరియా, రింగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి, సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

### ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నియామకం

పెనమలూరు: పెనమలూరు మండలానికి ఇన్‌చార్జి ఈవోపీఆర్డీని నియమించామని ఎంపీడీవో కుమార్‌బాబు తెలిపారు. గతంలో ఈవోపీఆర్డీగా పని చేసిన కోరా శ్రీనివాసరావు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా సీతారామరాజును నియమించారు. త్వరలో పూర్తి బాధ్యతలతో ఈవోపీఆర్డీని నియమించనున్నారు.

### విద్యార్థినులు ఆహార, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



గన్నవరం: విద్యార్థినులు ఆహార, ఆరోగ్య విషయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని వాసవ్య మహిళా మండలి ప్రతినిధి విజయ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఆదిత్య బిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో యుక్త వయస్సులో వచ్చే మార్పులు, రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ.. యుక్త వయస్సు ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. రక్తహీనత వంటి సమస్యలను అధిగమించేందుకు ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. మహిళా మండలి ప్రతినిధి హాసిని, ఉపాధ్యాయులు ఎస్‌వీఆర్ఎల్.ప్రసన్న, పార్వతి, గీత తదితరులు పాల్గొన్నారు.

### పునరావాస కేంద్రానికి 40 కుటుంబాల తరలింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఈదురు గాలుల ధాటికి బాపులపాడు మండలం వేలేరు ఎస్టీ తండాలో పూరిళ్లు ధ్వంసం కావటంతో నిరాశ్రయులైన పేదలను బుధవారం పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎస్టీ తండాకు చెందిన సుమారు 40 కుటుంబాలకు చెందిన తాటాకులు, పామాయిల్ కొమ్మలు, సిమెంటు రేకులు పైకప్పు కలిగిన ఇళ్లు మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం ధాటికి ధ్వంసమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ శాఖల అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. పలువురు ప్రజా ప్రతినిధులు బాధితులను పరామర్శించి, అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

### రేపటి నుంచి ఇండియన్ స్టార్టప్స్‌పై అంతర్జాతీయ సదస్సు

పటమట(విజయవాడతూర్పు): కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో 'ఇండియన్ స్టార్టప్స్ - సమస్యలు - సవాళ్లు - అవకాశాలు' అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ పారిశ్రామిక రంగ అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం స్టార్టప్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతలోని నూతన ఆలోచనలకు ప్రోత్సాహాన్ని అందించి పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేసే దిశగా తీర్చిదిద్దుతున్నాయన్నారు. ఆ క్రమంలో స్టార్టప్స్‌కు సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘమైన చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. ఆ క్రమంలో తమ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి 21వ తేదీన జరిగే ప్రారంభ సభకు స్థానిక శాసనసభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి వై. సత్యనారాయణ (సుజనా)చౌదరి ముఖ్యఅతిథిగా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజనల్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య బి. సుధాకర్‌రెడ్డి గౌరవ అతిథిగా హాజరవుతారన్నారు. అదేవిధంగా మలేషియాకు చెందిన ఏషియన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆచార్యులు శరత్‌కుమార్‌శెట్టి కీలకోపన్యాసకునిగా, యుఎస్ఏకు చెందిన ఆచార్య సత్యనారాయణ పరియిటమ్ ప్రధాన వక్తగా పలు విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రముఖులు వక్తలుగా హాజరవుతారన్నారు. రెండో రోజు జరిగే ముగింపు సభకు ఏపీ ఉన్నత విద్యాశాఖ రెగ్యులేటరీ అండ్ మోనటరింగ్ కమిషన్ మెంబర్ సెక్రటరీ అండ్ సీఈవో ఆచార్య డి. సూర్యచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు.

# ఉత్తమ ఫలితాల సాధనకు టీచర్లు కృషి చేయాలి



జెడ్పీ బాలికల హైస్కూల్‌కు షీల్డ్ అందజేస్తున్న డీఈవో తాహెరా సుల్తానా, దాసు, జాస్తి



హాజరైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

**డీఈవో తాహెరా సుల్తానా**

గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేయాలని జిల్లా విద్యా శాఖాధికారి తాహెరా సుల్తానా పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో 2023-24లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన పాఠశాలల ఉపాధ్యాయులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పుణ్యా చారిటీస్ సౌజన్యంతో పౌర సత్కారం చేశారు. పది ఫలితాల్లో మండలంలోనే మొదటి స్థానంలో నిలిచిన గన్నవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.రూప్సీరాణి, ఉపాధ్యాయులకు రోలింగ్ షీల్డ్ అందజేశారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముస్తాబాద, అత్కూరు జెడ్పీ హైస్కూల్స్ ఉపాధ్యాయ బృందాన్ని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణతను సాధించిన వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మిని సన్మానించారు.

**ప్రోత్సాహక కార్యక్రమాల కొనసాగింపు..**

ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం రోటరీక్లబ్ ద్వారా ఉపాధ్యాయులను ప్రోత్సాహిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. ఉపాధ్యాయులు ఇదే ఉత్సాహంతో పనిచేస్తూ వచ్చే ఏడాది నూటికి నూరు శాతం ఫలితాలు సాధనకు కృషి చేయాలని కోరారు. విద్యా రంగం అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు రోటరీ క్లబ్ నిరంతరం తోడ్పాటును అందిస్తోందని రోటరీ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంపీ దాసు పేర్కొన్నారు. ప్రతి ఏడాది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ, ఉపాధ్యాయుల ప్రోత్సాహక కార్యక్రమాలను కొనసాగిస్తామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ తెలిపారు. అనంతరం రోటరీ క్లబ్ ఉత్తమ సేవా పురస్కారాన్ని కేసరపల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు షమీరాకు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పార్థసారథి చేతుల మీదుగా అందజేశారు. ఎంఈవో కె.రవికుమార్, గన్నవరం క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటేరియన్లు గన్నె వెంకట్రావు, చింతపల్లి సీతారామయ్య, టీఎస్ఆర్‌కె.ప్రసాద్, జీవీ రవిబాబు, కె.ఎస్.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

**ప్రిన్సిపాల్ యశోద లక్ష్మికి అభినందనలు**

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మిని గన్నవరంలో ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఆమె సేవలను రోటరీ క్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ కొనియాడారు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది యశోద లక్ష్మికి అభినందనలు తెలియజేస్తూ విద్యార్థులను ఉన్నతంగా తయారు చేయటంలో ఆమె కృషిని ప్రశంసించారు. గురుకుల పాఠశాల మరిన్ని విజయాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డీఈవో తాహెర సుల్తానా, ఎంఈవో కొండా రవిబాబు, రోటరీ క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు అభినందనలు తెలిపారు.

## సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బాపులపాడు పీహెచ్‌సీ సిబ్బంది

హనుమాన్‌జంక్షన్ రూరల్: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి పట్ల ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించటం ద్వారా రోగి జీవన నాణ్యతను మెరుగుపర్చేందుకు అవకాశం ఉందని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నారయ్య చెప్పారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లో పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సికిల్ సెల్ ఎనీమియా వారసత్వంగా వచ్చే ఎర్ర రక్త కణాల రుగ్మత అని, ఇది ఎలాంటి అంటు వ్యాధి కాదని చెప్పారు. రక్తహీనత, శ్వాస ఇబ్బందులు, కీళ్ల నొప్పులు, పెరుగుదల సమస్యలు వంటి లక్షణాలతో ఈ వ్యాధిని తొలిదశలోనే గుర్తించవచ్చని డాక్టర్ నారయ్య చెప్పారు. ఎంపీహెచ్‌వో నాగరాజు, పలువురు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## స్టూడెంట్ కిట్స్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్ బుధవారం విద్యార్థులకు 'స్టూడెంట్ కిట్స్' పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థి, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని చలసాని చెప్పారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఫలితాలు సాధించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.పద్మజ మాట్లాడుతూ స్టూడెంట్ కిట్స్ కింద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం, నోట్‌బుక్స్, టెక్స్ట్ బుక్స్, బెల్ట్, షూస్, స్కూల్ బ్యాగ్ అందజేశామన్నారు. అనంతరం అతిథులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, మాజీ సర్పంచ్‌లు చింతల వెంకటశివ అప్పారావు, దన్నె దుర్గారావు, గ్రామ ప్రముఖులు గరికపాటి ఉమామహేశ్వరరావు, నూకల రాఘవ పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ అధినేతతో ఆత్మీయ కలయిక



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో వెలగపల్లి ప్రదీప్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్ ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం చేస్తున్న కృషిని అధినేత దృష్టికి తీసుకువెళ్లినట్లుగా ప్రదీప్ తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో పలు అక్రమ కేసులు ఎదుర్కొనానని, రౌడీషీట్ సైతం ఓపెన్ చేసి వేధింపులకు గురిచేశారని అధినేతకు చెప్పానన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు ప్రదీప్ పేర్కొన్నారు.

## ప్రతి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాలు పని చేయాలి

విజయవాడరూరల్: ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు(సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) పని చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు కచ్చితంగా చర్యలు చేపట్టాలని జిల్లా కో ఆర్డినేటర్ అరుణ ఆదేశించారు. విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా డీసీ అరుణ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి రోజూ తడిచెత్త, పొడిచెత్త సేకరించి వాటి ద్వారా వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయాలని, తద్వారా సంపదను సృష్టించుకోవాలన్నారు. ఈ కేంద్రాలు పనిచేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు పని చేయాలని చెప్పారు. అనంతరం డివిజనల్ పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయలన్నారు. ఈ నెలాఖరు నాటికి నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ నిర్ణయించిందని చెప్పారు. డివిజన్లో ఇప్పటి వరకు 70 శాతం ఇంటి పన్ను వసూలు జరిగిందని, మిగిలిన 30 శాతం వసూలు చేయాలన్నారు. సమావేశంలో డివిజన్‌లోని ఈవోఆర్డీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కానూరులో గుర్రపుడెక్క తొలగింపు



పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కానూరు 100 అడుగుల రోడ్డులో గుర్రపుడెక్క, ఇతర పిచ్చి మొక్కలు, వ్యర్థ పదార్థాలతో డ్రెయినేజీ పూడుకు పోయిందన్నారు. దీని కారణంగా మురుగునీరు పారుదల కావటం లేదని తెలిపారు. ఈ ప్రాంతంలో నివాసాలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకొని డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టామన్నారు. డ్రెయినేజీల పూడిక తీతతో వచ్చే వర్షాకాలంలో ముంపు నివారణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

## పోరంకిలో అఖండ అన్నసమారాధన



పెనమలూరు: పోరంకి గ్రామం లక్ష్మీపురం కాలనీలో శ్రీవెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అఖండ అన్న సమారాధన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉదయం శ్రీవారికి లక్ష మల్లెల అర్చన, పుష్ప యాగం చేశారు. దాదాపు ఆరు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, నిత్యహోమం, సహస్ర దీపాలంకరణ సేవ జరిపారు. గురువారం మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం రథోత్సవం, పవళింపు సేవ తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఉంగుటూరు: మూడేళ్ల వయసు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈఓ-2 సాంబశివరావు అన్నారు. వెల్దిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం అందించడంతో పాటు బాల్యం నుంచి చక్కని నడవడిక, క్రమశిక్షణ అలవడతాయన్నారు. పౌష్టికాహారం తదితర అంశాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మాదేవి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లాం నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## • పింక్ సాల్ట్‌కు భలే డిమాండ్



ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే హిమాలయన్ పింక్ సాల్ట్ కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రాజస్థాన్‌కు చెందిన కొందరు వ్యాపారులు ట్రక్కులపై సైంధవ లవణం తీసుకొచ్చి కిలో రూ.100కి విక్రయిస్తున్నారు. బీపీ, సుగరు, థైరాయిడ్, ఎసిడిటీ మొదలైన బాధితులు ఈ లవణాన్ని వినియోగించటం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని చెబుతుండటంతో ఈ సాల్ట్‌ను కొనుగోలు చేసేందుకు జనం ఎగబడుతున్నారు. కృష్ణాజిల్లా కంకిపాడులో బుధవారం పింక్ సాల్ట్ విక్రయిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

- కంకిపాడు

## యనమలకుదురులో నందీశ్వరునికి అభిషేకం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయోదశి ప్రదోషకాల సమయంలో శివాలయంలో అష్టముఖ పానువట్టంపై బ్రహ్మసూత్రంతో ఉన్న శ్రీనందీశ్వరునికి అభిషేకం చేశారు. దీని వల్ల భక్తులకు జాతక దోషాలు, రుణబాధలు, రోగ నివారణ తొలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ అభిషేక పూజల్లో 22 మంది ఉభయ దాతలు పాల్గొని అభిషేకం చేశారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

## కొనసాగుతున్న ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులు



ఓపెన్ జిమ్ పనులను పరిశీలిస్తున్న కిషోర్, వాకర్స్

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కేటాయించిన రూ.7 లక్షల నిధులతో ఓపెన్ జిమ్‌కు పరికరాలు మంజూరయ్యాయి. కోర్టు పక్కనే ఉన్న క్రీడా ప్రాంగణంలో జిమ్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ పర్యవేక్షిస్తున్నారు. అయితే కాంట్రాక్ట్ ఒప్పందం మేరకు జిమ్ పరికరాలు ఏర్పాటు వరకే అధికారులు చేపట్టారు. మిగిలిన ఫ్లోరింగ్, చుట్టూ రక్షణ కంచె తదితర నిర్మాణ పనులను పూర్తి చేయాల్సి ఉందని కిషోర్ తెలిపారు. సుమారు రూ.3.50 లక్షలతో చేపట్టనున్న ఈ పనులకు వాకర్స్‌తో పాటు దాతలు తమ వంతు తోడ్పాటునందించాలని కోరారు.

## శ్రీలక్ష్మీతిరుపతమ్మ సేవాసదనం నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత ఈశ్వర్‌ప్రసాద్ దంపతులు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సేవాసదనం నిర్మాణానికి ఇరువురు దాతలు రూ.2.50 లక్షలు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన కొడాలి ఈశ్వర్‌ప్రసాద్, సంధ్యారాణి దంపతులు రూ.2 లక్షల విరాళం బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన లంక శ్రీనివాస్ దంపతులు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న సేవాసదనం నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకువచ్చి విరాళాలు అందజేస్తున్న భక్తులకు శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. భక్తులందరి సహకారంతో సేవాసదనం త్వరితగతిన పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పొట్ల శివలీల తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



గంగూరులో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: గంగూరు గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శాసనసభ్యుడు బోడె ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద అంబేడ్కర్ కాలనీ హేబిటేషన్‌కు గతంలో ప్రభుత్వం రూ.32 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణంతో అంబేడ్కర్ కాలనీలో తాగునీరు సరఫరా పూర్తి స్థాయిలో జరుగుతుంది. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపీఆర్.కుమార్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎల్.నారాయణరావు, ఏఈ నాంచారయ్య, పంచాయతీ కార్యదర్శి ఏ.సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్‌పాషా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు హుమయున్, ప్యారీలతీఫ్, వార్డు సభ్యులు ఫర్హానపర్వీన్, అబ్దుల్‌గని, అన్సర్‌బాషా, సందీప్, శివశంకర్, జయరాజ్, పిచ్చయ్య, పి.బాబురావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మౌలిక వసతుల కల్పనే ప్రథమ కర్తవ్యం**

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనే ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు పట్టణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు, నిరుపయోగంగా పడి ఉన్న పీహెచ్‌సీ భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై ఎమ్మెల్యేకు సీహెచ్‌సీ మాజీ చైర్మన్ వై.కిషోర్‌బాబు బుధవారం పోరంకిలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ విద్య, వైద్యం, పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటానన్నారు. మౌలిక వసతులను కల్పించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించటం లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు.

## సున్నిత హాస్యానికి చిరునామా జంధ్యాల



జంధ్యాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హజరత్తయ్య గుప్తా, కుమార్, నృసింహం

విజయవాడ కల్చరల్: సున్నిత హాస్యానికి చిరునామా దర్శకుడు జంధ్యాల అని సీనియర్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, అభిరుచి, సి. రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని సినీ దర్శకుడు, నటుడు, మాటల రచయిత జంధ్యాల విగ్రహం వద్ద బుధవారం 23వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ కుటుంబ సమేతంగా చిత్రాలకు దర్శకత్వం వహించిన జంధ్యాల జీవితం నగరంతో ముడిపడి ఉండటం విశేషమన్నారు. జంధ్యాల నగరంలోని ప్రభుత్వ కళాశాలలో చదువుకున్నారన్నారు. తెలుగు వారి హాస్య చతురత ప్రపంచానికి తెలియ జేశారని కొనియాడారు. 23కు పైగా జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకున్నారన్నారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ చిరంజీవిలాంటి మెగా స్టార్‌తో హాస్య చిత్రానికి దర్శకత్వం వహించడం ఆయనకే చెల్లిందన్నారు. కార్యక్రమంలో రంగస్థల నటుడు ఆచంట బాలజీ నాయుడు, చిత్రకుల హరగోపాల్ పరుచూరి విజయలక్ష్మి, గాయకుడు కుమార్‌తోపాటు జంధ్యాల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత జంధ్యాల విగ్రహానికి నివాళి సమర్పించారు. అనంతరం పేదలకు అన్న, వస్త్ర దానం నిర్వహించారు.

## • ప్రమాదం అంచున విహారం



ఈత ఆరోగ్యదాయకమే.. అయినా అది ఎక్కడ చేయాలో.. ఏ పరిస్థితుల్లో చేయాలో అక్కడే చేయాలి. నదీ గర్భాల్లో.. అధిక లోతు, సుడిగుండాలు ఉండే ప్రాంతాల్లో సరదాగా ఈతకు దిగితే ప్రాణాల మీదకు వస్తుంది. ఈ చిత్రం చూడండి.. కృష్ణలంక, తాడేపల్లి మధ్య ఉన్న కృష్ణా నదిలోని గుంతల్లో చిన్నారులు ప్రమాదకరంగా స్నానాలు చేస్తుండగా, మరికొందరు ఈత కొడుతున్నారు. ఆ ప్రదేశంలో లోతు ఎక్కువగా ఉండటంతో కొందరు స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఇప్పటికైనా పెద్దలు పిల్లలకు ప్రమాదాలపై అవగాహన కల్పించడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ